సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



గొంతు తడారి.. ఇదో ఎడారి


ఆటలాడి... అలసి సొలసిన క్రీడాకారులకు గుక్కెడు నీరు దొరకడం గగనమైంది. గొంతు తడారి దిక్కులు చూస్తున్నా అక్కడ ఎడారినే తలపిస్తోంది. - 8లో



అది పులి కాదు.. అడవి పిల్లి

దివాన్‌చెరువు శివారు శ్రీరామపురం, రాకీ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలోని తోటల్లోకి బుధవారం రాత్రి చిరుతపులి దూకిందనే ప్రచారంలో నిజం లేదని అధికారి ఎస్.భరణి తెలిపారు. 8లో

2.01 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 2,01,882 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీరు వదిలారు.

వంచనలో సెంచరీ!

- సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి కోసం అచరణ సాధ్యంకాని హామీలు
- తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వచ్చిన పలు సందర్భాల్లో అనేక వరాలు
- సభలు, సమావేశాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు
- నేటికీ ఒక్క హామీ అమలు చేయని వైనం
- బాబు, పవన్, లోకేష్ హామీలపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్న ప్రజలు

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందడమే ధ్యేయంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, తనయుడు లోకేష్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన సభలు, సమావేశాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ అమలు చేస్తామని చెప్పారు. స్థానికంగా మరికొన్ని హామీలు గుప్పించారు. ఎన్నికలు ముగిశాయి. కూటమి ప్రభుత్వం సైతం కొలువుదీరింది. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తవుతోంది. హామీల అమలు ఊసే ఎత్తడం లేదు. ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వడం లేదు. హామీల అమలు ఎప్పుడు జరుగుతుందా..? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. కొందరైతే ఏరు దాటాక తెప్పతగలేసే బాబును నమ్మలేమని, హామీలతో తమను వంచించారని అంటున్నారు.

అరచేతిలో వైకుంఠం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ప్రజలకు చంద్రబాబు అర చేతిలో వైకుంఠం చూపించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, హైటెక్ సిటీలు.. ఐటీ టవర్ల నిర్మాణం.. పల్లెలను సింగపూర్‌గా మారుస్తానన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం, తల్లికి వందనం పథకంలో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఖాతాల్లో జమ చేస్తామన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి హామీలతో మేనిఫెస్టో రూపొందించారు. తీరా అమలు చేయాల్సిన సమయం ఆసన్నమవడంతో ఆర్థిక పరిస్థితి బాగాలేదన్న సాకును తెరపైకి తెస్తున్నారు. దీన్ని గమనిస్తున్న ప్రజలు చంద్రబాబును బురిడీ బాబుగా అభివర్ణిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటన సందర్భంగా చంద్రబాబు, పవన్, లోకేష్ ఇచ్చిన హామీలకు సంబంధించి మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...





ఎన్నికల వేళ నిడదవోలు, కొవ్వూరు సభల్లో హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు

కలగానే భూముల రిజిస్ట్రేషన్

రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సంబంధించి సుమారు 1,800 ఎకరాల భూముల్లో కొందరు ఎప్పటి నుంచో ఇళ్లు కట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయినా వాళ్లకు ఎలాంటి హక్కులూ లేవు. వీటిపై వివాదం నడుస్తోంది. ఎన్నికల ప్రచారం సందర్భంగా కోరుకొండ వచ్చిన చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఇంకే ముంది ఎన్నికలు సమీపిస్తున్నాయి..? హామీ ఇచ్చేస్తే పోయిందిగా.. అనుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూములు అనుభవదారుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చేశారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా.. ఆ హామీకి అతీగతీ లేకుండా పోయింది.

హామీలివీ....

- కోరుకొండ, సీతానగరం మండలాల పరిధిలోని 38 వేల ఎకరాల భూములకు సాగునీరు వచ్చేలా చేస్తానన్న హామీ సైతం నేటికీ కార్యరూపం దాల్చలేదు.
- రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కాతేరు గ్రామంలో మే నెలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ, పవన్, చంద్రబాబు, లోకేష్ వచ్చారు. భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సభలో సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. వాటిలో ఏవీ అమలు చేయకపోవడాన్ని బట్టి చూస్తుంటే సాక్షాత్తూ ప్రధాని పాల్గొన్న సభా వేదిక నుంచే అబద్ధాలు వల్లించారన్న విషయం స్పష్టమవుతోంది.
- కొవ్వూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 4వ తేదీన కొవ్వూరు వచ్చారు. ఇక్కడ సైతం అవే అలవికాని హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఉద్యోగాలు సృష్టిస్తానని ఉపన్యాసాలు ఇచ్చారు. ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్న బాబు ఉద్యోగాలు ఎప్పుడిస్తారన్న ప్రశ్న కొవ్వూరు ప్రజల్లో ఉత్పన్నమవుతోంది.
- నిడదవోలు నియోజకవర్గంలో ఏప్రిల్ 10వ తేదీన ఎన్నికల బహిరంగ సభ పెట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన పవన్ కల్యాణ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిడదవోలు అభివృద్ధికి అంటూ బాబు పలు హామీలు గుప్పించేశారు.
- నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అధునీకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ హామీ నెరవేర్చే దిశగా అడుగులు పడలేదు.
- ఎర్రకాలువపై కంసాలపాలెం, మాధవరం మధ్య వంతెన నిర్మాణం చేపడతామన్నారు. నేటికీ పనులు ప్రారంభం కాలేదు.
- నిడదవోలులో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో క్రీడలను ప్రోత్సహిస్తానన్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం క్రీడాకారులు నిరీక్షిస్తున్నారు.
- నిడదవోలు పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి జలాలను అందజేస్తామన్నారు. చుక్కనీరు కూడా ఇచ్చిన దాఖలాలు లేవు.
- నియోజకవర్గంలోని రహదారులకు ఉన్న గోతులన్నీ అధికారం చేపట్టిన మూడు నెలల్లో పూడుస్తామన్నారు. ఇప్పటికీ తట్ట మట్టి కూడా వేయలేదు.
- పెరవలి మండలం కానూరు–ఉండ్రాజవరం రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. నేటికీ అటువైపు కన్నెత్తి కూడా లేదు.



ABN ఆంధ్రజ్యోతి

మిచౌంగ్' ముంచేసినా రైతులను ఆదుకోలేదు

డిసెంబరులో మిచౌంగ్ తుపాన్ వచ్చి రైతాంగం చితి

నేనే డ్రైవర్‌గా ఉంటా...

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి నేనే డ్రైవర్‌గా ఉండి సురక్షితంగా గమ్యం చేరుస్తా. 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తాం. మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం. నిరుద్యోగ భృతి రూ.3,000 ఇస్తాం. ఆక్వా రైతులకు రూ.1.50కే కరెంటు ఇస్తాం. టీడీపీ హయాంలో మొత్తం 11 సార్లు డీఎస్సీ వేశాం. ఐదేళ్లలో ఒక్కసారి కూడా వేయలేని దద్దమ్మ ప్రభుత్వమిది. ఏపీపీఎస్సీలో ఉద్యోగాలు అమ్ముకున్నారు. మేమొచ్చాక ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేపడతాం. చిందరవందరగా మిగిలిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతాం.



ప్రతి చేతికీ పని.. ప్రతి చేనుకూ నీరు

ఇదే జనసేన, తెదేపా, భాజపా కూటమి లక్ష్యం: పవన్

న్యూస్‌రీల్

నిరుద్యోగ భృతికి దరఖాస్తుల ఆహ్వానం

26వ తేదీ తుది గడువు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రభుత్వం వేదవిద్య ఉత్తీర్ణులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని జిల్లా దేవదాయ శాఖాధికారి వి.సోమరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు తుది గడువు ఈ నెల 26వ తేదీ అని, వేద విద్యలో క్రమాంతం ఆపై కోర్సులు అభ్యసించి ఉత్తీర్ణులైన నిరుద్యోగులు, నిరుద్యోగ భృతిని పొందడానికి దరఖాస్తుతో పాటు వేద విద్య సర్టిఫికెట్ల నకలు, ఆధార్ నకలు, ఏ ఉద్యోగం చేయడం లేదని స్వీయ వాంగ్మూలం (సెల్ఫ్ డిక్లరేషన్) ధృవపత్రం జతచేసి జిల్లా దేవదాయ శాఖ అధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ, రాజమహేంద్రవరం కార్యాలయంలో 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 0883–2478375 ఫోన్ నెంబర్‌ను కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

పర్యాటకానికి పెద్దపీట

మంత్రి దుర్గేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో పర్యాటకానికి పెద్దపీట వేస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఈ నెల 27వ తేదీన విజయవాడలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా హోటళ్లు, టూరిజం కేంద్రాలకు సంబంధించి 38 విభాగాల్లో అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే అమరావతిలో మెగా టూరిజం హబ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. అఖండ గోదావరి పేరుతో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ప్రాంతాలను ఐకానిక్ సెంటర్‌గా శాసి స్కీంలో పొందుపరచినట్టు తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి అక్టోబర్ 15 నాటికి డీపీఆర్ పంపనున్నట్టు తెలిపారు.

శిశువు మరణంపై త్రిసభ్య కమిటీ విచారణ



శిశువు మృతిపై విచారణ నిర్వహిస్తున్న త్రిసభ్య కమిటీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన శిశు మరణంపై త్రిసభ్య కమిటీ గురువారం విచారణ జరిపింది. కమిటీ సభ్యులు డాక్టర్ హేమంతి, డాక్టర్ మోహన్‌చంద్ర, డాక్టర్ అనాల కుమార్ బృందం పలువురి నుంచి వివరాలు సేకరించారు. విచారణ చేపట్టిన కమిటీకి బాధితులు పలు విషయాలు వివరించారు. ఈ నెల నాలుగో తేదీన అల్కాట్ తోటకు చెందిన నిండు గర్భిణి వాసవి దుర్గరత్నం దత్త సాయిని ఆమె తల్లిదండ్రులు ఈశ్వరరావు, కవిత ప్రసవం నిమిత్తం ఉదయం 10.30 సమయంలో ఆస్పత్రిలో చేర్చారు. సాయంత్రం వరకు వైద్యులు పట్టించుకోకపోవడంతో దత్తసాయికి తీవ్ర రక్తస్రావమైందని ఆమె తల్లిదండ్రులు విచారణ కమిటీకి తెలిపారు. ఈ విషయాన్ని వైద్యులకు వివరించగా వారు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్లి సాయంత్రం 6.10కి సర్జరీ చేశారన్నారు. కొద్ది సేపటికి పుట్టిన బాబు చనిపోయాడని వైద్యులు తమకు చెప్పారన్నారు. వైద్యులు వెంటనే స్పందించి ఆపరేషన్ త్వరగా చేసి ఉంటే బాబు బ్రతికి ఉండే వాడని తెలిపారు. గర్భిణికి 2.30కే ఆపరేషన్ చేయాలని వైద్యులు ముందుగా నిర్ధారించారని, వైద్యుల అలసత్వం వల్లే తల్లికి తీరని అన్యాయం జరిగిందన్నారు. కాగా డాక్టర్ హేమంతి మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని బాధితులకు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ, దాని మిత్ర పక్షాలు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.

వైద్యసేవలకు ఆటంకం

- పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన
- వైద్యులు లేక ఇబ్బందులు పడుతున్న రోగులు



సీతానగరం పీహెచ్‌సీలో వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

రాజమహేంద్రవరం రూరల్: పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో వారు ఆందోళన పట్టారు. దీంతో రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల ప్రబలడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్‌కోటా కుదింపును నిరసిస్తూ ఈ నెల పదో తేదీ నుంచి పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో 42 పీహెచ్‌సీల్లో 108 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్క పీహెచ్‌సీలో 40 నుంచి 100 వరకు ఓపీ వస్తుంది. ప్రస్తుతం వైద్యులు సేవలు నిలిపివేయడంతో సిబ్బంది తాత్కాలికంగా మందులు ఇచ్చి పంపిస్తున్నారు. పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందకపోవడం వల్ల కూటమి ప్రభుత్వం తీరుపై రోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం : ఎంపీ పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: దేశం అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల కల్పన ముఖ్యమని భావించి రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు, వంటి వాటిపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం జేఎన్ రోడ్‌లోని ఎంపీ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కోసం 3 లక్షల కోట్ల రూపాయిలు కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. గ్రామ సడక్ యోజన 4వ దశలో భాగంగా 25 వేల గ్రామాల అనుసంధానానికి శ్రీకారం చుట్టారని ఆమె తెలిపారు. రు.50,600 కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం, 8 కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతులకు కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లో రు.6 వేలు మూడు విడతలుగా కేంద్రం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

సీటీఆర్ఐ: ప్రతి మహిళకు పోషకాహారాన్ని అందించడంతో పాటు అవగాహన కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రతీ మహిళకు పోషకాహారాన్ని అందించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వరుసగా ఏడో 'రాష్ట్రీయ పోషణ్ మా' ద్వారా గర్భిణులు, బాలింతలకు, యుక్త వయసు బాలికలకు పోషకాహారాన్ని అందించడంతో పాటు, సీమంతాలను కూడా జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా కమిషన్ సూచనల మేరకు మహిళా కారాగారంలో హెర్బల్ ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. మహిళా ఖైదీలకు వారి హక్కుల ప్రకారం ప్రభుత్వం వారికి అందిస్తున్న సేవలను పరిశీలించామన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో కూడా పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఇక్కడ వున్న మహిళా ఖైదీలు పరివర్తన చెందేలా వారు చేసిన తప్పులు సరి దిద్దుకునేలా వారి జీవన విధానంలో మార్పులు రావాలని కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. వారి ఆరోగ్య రీత్యా వివిధ విభాలకు చెందిన వైద్యులను రప్పించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించామన్నారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారి, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ డీఎస్పీ వసంతకుమారి, ఉమెన్ కమిషన్ లీగల్ కౌన్సిలర్ ఎ.పూజిత తదితరులు పాల్గొన్నారు .

ఎలుకల నివారణ ఒకేసారి చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులందరూ ఒకేసారి ఎలుకల నివారణ చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. గురువారం రాజవోలు గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మాధవరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో ఉచితంగా ఇస్తున్న ఎలుకల మందును రైతులందరూ వినియోగించాలని తెలిపారు. రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంట చిరు పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో పొటాష్ వాడకం వల్ల వరి పంటకు తెగుళ్లు, పురుగులను తట్టుకొనే శక్తి వస్తుందని, అధిక దిగుబడికి ఇది ఎంతో అవసరమని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు రామలక్ష్మి మాట్లాడుతూ రైతులు విచక్షణ రహితంగా పురుగు మందులు వాడవద్దని, పురుగులు, తెగుళ్ల నష్ట పరిమితిని దృష్టిలో ఉంచుకొని అవసరం మేరకే పురుగు మందులు వాడాలని, వాడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోడిగుడ్డు, నిమ్మరసంతో పంటకు అవసరమైన పోషక ద్రవాన్ని తయారుచేసి చూపించారు. మండల ఉద్యాన అధికారి డి.సుధీర్ కుమార్ జిల్లా ఏపీఎంఐపీ ద్వారా డ్రిప్, స్ప్రింక్లర్ రాయితీ, ఆర్‌కేవీవై ద్వారా శాశ్వత పందిళ్ల, కలెక్షన్ సెంటర్లు ఎన్ఎంఈఓటీపీ ద్వారా ఆయిల్ పామ్ విస్తరణ పథకం ద్వారా రైతులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రామం, వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పవర్‌ఫుల్' పైరవీలు

- ఆదాయం వచ్చే స్థానాలపై గురి
- నేటితో ముగియనున్న బదిలీల ప్రక్రియ

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో బదిలీల ప్రహసనం నడుస్తోంది. జీతం కంటే గీతం ఎక్కువగా వచ్చే స్థానాలపై ఉద్యోగులు కన్నేస్తున్నారు. వాటిని దక్కించుకునేందుకు ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రుల వద్దకు ఆశావహులు క్యూ కడుతున్నారు. రూ.లక్షలు ముట్టజెప్పేందుకు సైతం వెనుకాడటం లేదు. ఈ వ్యవహారం విద్యుత్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కొన్ని బదిలీలు పూర్తికాగా నేటితో ప్రక్రియ ముగియనుండటంతో ఉద్యోగులు పైరవీలకు పాకులాడుతున్నారు. రాజమహేంద్రవరం సర్కిల్ ఆపరేషన్ సెక్షన్ పోస్టుకు భారీ డిమాండ్ నెలకొంది. ఇందుకు ఉద్యోగులు పోటీ పడుతున్నారు. డీ7 సెక్షన్ కోసం ముగ్గురు ఏఈలు నువ్వా, నేనా అంటూ పోటీ పడుతున్నారు. ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులు ఎంపీ, ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్లు సైతం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఇందులో ఓ సెక్షన్‌కు చెందిన ఉద్యోగి తనకు డీ7 సెక్షన్ కట్టబెడితే రూ.30 లక్షలు ముట్టజెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారాన్ని చక్కబెట్టేందుకు ఓ అసోసియేషన్ నేత రంగంలోకి దిగినట్లు సమాచారం. సర్కిల్ ఏఓ రెవెన్యూ పోస్ట్ కోసం ఓ అధికారిణి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు, కార్పొరేట్ కార్యాలయంలో ఓ అధికారి ఆశీస్సులు తనకు ఉన్నాయని ధీమా వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. సదరు అధికారిణి తిరిగి కొత్తగా ఏర్పడే భీమవరం సర్కిల్‌కి ఇన్‌చార్జి ఎస్ఏఓగా వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమెను వేరే సర్కిల్‌కు బదిలీ చేయాలని ఏలూరు సర్కిల్ ఉద్యోగులు విద్యుత్ శాఖ సీఎండీకి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిసింది.

రాష్ట్ర స్థాయి టీటీ పోటీలకు సత్యనారాయణ



సత్యనారాయణను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

పెదపూడి: రాష్ట్ర స్థాయి టీటీ పోటీలకు పాలమూరులోని సత్తి వీర్రాఘవరెడ్డి, లక్ష్మీనరసయమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పెంకే వీర వెంకటసత్యనారాయణ ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ ఎస్ఎస్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఆ విద్యార్థిని అభినందించారు. ఈ నెల 18న కాకినాడలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యాడన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.సురేష్, ఎస్ఎంసీ చైర్మన్ వాసంశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం తరపున కోనాల సత్తిరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

డెంగీతో బాలిక మృతి

శంఖవరం: స్థానికంగా వెన్నెల వనజ (3) డెంగీ జ్వరంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శంఖవరం ప్రభుత్వాసుపత్రి వైద్యుడు ఆర్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుందని రక్త పరీక్షలు చేయించగా, డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని వివరించారు. జ్వరం ఎక్కువగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామని కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందన్నారు.

రైల్వే ఆదాయంలో సామర్లకోటకు 8వ స్థానం

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైల్వే స్టేషన్లలో సామర్లకోటకు ఆదాయంలో 8వ స్థానం సాధించింది. రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధుల మంజూరులో భాగంగా 30 రైల్వే స్టేషన్‌ల్లో ప్రయాణికులు, ఆదాయ వివరాలను రైల్వే కమిటీ సేకరించినట్లు అధికారులు గురువారం తెలిపారు. రాష్ట్రంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్రథమ, శ్రీకాళహస్తి 30, రాజమహేంద్రవరం 4, కాకినాడ 11, తుని 29వ స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఇక్కడ 2023–24లో రిజర్వేషన్ టిక్కెట్ల ద్వారా 8,63,004 మంది ప్రయాణించగా, రూ.52,35,87,551 ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా 15,95,150 మంది సాధారణ ప్రయాణికుల ప్రయాణంతో రూ.13,81,80,065 ఆదాయం సమకూరిందన్నారు.

పశువుల అక్రమ తరలింపు అడ్డగింపు

కొవ్వూరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని గురువారం విశ్వ హిందూ పరిషత్ సభ్యులు స్థానిక గామన్ ఇండియా బ్రిడ్జి వద్ద అడ్డుకుని కొవ్వూరు పట్టణ పోలీసులకు అప్పగించారు. కంటైనర్ మాదిరిగా ఉన్న ఈ లారీలో చుట్టూ మూసివేసి పైకప్పు కొంత భాగం ఓపెన్‌గా ఉంచి ఏకంగా 53 పశువులను తరలిస్తున్నారు. మూగజీవాల తరలింపులో ఏవిధమైన నిబంధనలు పాటించలేదు. పాయకరావుపేట నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఈ పశువులను తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

గొంతు తడారి.. ఇదో ఎడారి

- కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో దుస్థితి
- పాడైన వాటర్ ప్లాంట్
- నీటి కోసం క్రీడాకారుల పాట్లు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల సందర్భంలోనూ అంతే



డీఎస్‌ఏలో మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆటలాడి... అలసి సొలసిన క్రీడాకారులకు గుక్కెడు నీరు దొరకడం గగనమైంది. గొంతు తడారి దిక్కులు చూస్తున్నా అక్కడ ఎడారినే తలపిస్తోంది.. కనీస సౌకర్యాలు లేక, ఎవరూ పట్టించుకోక ఏళ్లకాలంగా ఇబ్బంది తరుముతూనే ఉంది. ఇదేదో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరబడినట్టే. జిల్లా కేంద్రం, అందులోనూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాకు అతి కీలకమైన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో దుస్థితి. జలం.. మనిషి ఎంతో అవసరం. రోజూ కనీసం 3 నుంచి 5 లీటర్ల నీరు తాగాలనేది వైద్య నిపుణుల మాట. సాధారణ వ్యక్తుల కంటే క్రీడాకారుల జీవన శైలి కాస్త భిన్నం. అందుకే వారు నీరు ఎక్కువగా తీసుకోవాలని చెబుతుంటారు. అయితే కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నీటి కోసం పాట్లు పడాల్సి వస్తోంది. ఇక్కడకు రోజూ వందలాది సంఖ్యలో క్రీడాకారులు వచ్చి వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతుంటారు. వీరితో పాటు పోలీస్, ఇన్‌కం ట్యాక్స్, ఆర్మీ, నేవీ తదితర ఉద్యోగాల కోసం శారీరక పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు, వాకర్స్ కూడా వస్తుంటారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికలు, పోటీలు నిర్వహించే రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్రీడాకారులు డీఎస్‌ఏలోనే ఉంటారు. మారిన వాతావరణ పరిస్థితుల్లో చలికాలంలోనూ ఎండలు అధికమయ్యాయి. తాగునీటి అవసరాలూ పెరిగాయి. అయితే డీఎస్‌ఏకు వివిధ అంశాలపై వస్తున్న వారు గుక్కెడు నీటి కోసం బయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. తాగుదామంటే గుక్కెడు నీరు దొరకక ఇబ్బంది వెంటాడుతోంది. ఏళ్ల కిందట డీఎస్‌ఏలోని మినరల్ వాటర్ ప్లాంట్ పాడైంది. తాగునీరు సౌకర్యం ఉందని చెప్పుకోవడానికి ఒక చేతి పంపును ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. వెయ్యి మంది క్రీడాకారులకు ఈ ఒక్క పంపు ఏవిధంగా సరిపోతుందని క్రీడా సంఘాల ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. అవుట్‌డోర్ ఫీల్డ్‌లో హాకీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, క్రికెట్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, ఇండోర్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, టీటీ, రెజ్లింగ్, స్విమ్మింగ్, స్క్వాష్‌లో శిక్షణ పొందుతున్న వారు, రోజూ ఫిట్‌నెస్ వ్యాయామాలు చేసిన తరువాత తప్పకుండా నీటిని తాగాలి. కానీ వారు తెచ్చుకున్న బాటిల్‌లో నీరు అయిపోతే ఇంటికి వెళ్లే వరకూ గొంతు ఎండాల్సిందే.

ఆదాయం వస్తున్నా..

ఆదాయ పరంగా నెలకు ఒక్క డీఎస్‌ఏ షాపింగ్ కాంప్లెక్స్ నుంచే రూ.3 లక్షలు, ప్లే అండ్ ప్లే విధానంలో మరో రూ.2 లక్షలు ప్రతి నెలా వస్తున్నాయి. అయినా తాగునీటి ప్లాంట్‌ను బాగు చేయడానికి చర్యలు తీసుకోకపోవడంపై క్రీడాకారుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



ఈ పాత చేతిపంపు ఒక్కటే ఆధారం

శాశ్వత పరిష్కారం చూపాలి



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో వివిధ క్రీడా అసోసియేషన్లు, ఎస్‌జీఎఫ్‌ఐ, శాప్, ఖేలో ఇండియా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపికలు, పోటీలు జరిగినప్పుడు తాగునీరు సౌకర్యం కల్పించాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–వి.రవిరాజు, జిల్లా వ్యాయామ, ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు

ఇబ్బంది ఉన్నా భరించాల్సిందే..



నేను మూడేళ్లుగా డీఎస్‌ఏలో అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. తాగునీటి సౌకర్యం లేక ఇంటికి వెళ్లి నీరు తాగాల్సి వస్తుంది. అప్పటి వరకూ ఎంత దాహం ఉన్నా భరించాల్సిందే. చాలా ఇబ్బంది పడుతున్నాం.

– ఉదయ్‌కుమార్, అథ్లెటిక్స్ క్రీడాకారుడు

ఇంటి నుంచే తెచ్చుకుంటూ..



నేను మూడేళ్లుగా జిల్లా క్రీడా మైదానంలో జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ పొందుతున్నాను. ఇంటి నుంచి తెచ్చుకున్న బాటిల్‌లో నీరు అయిపోతే ఇంతే సంగతులు. మళ్లీ నీరు పట్టుకుందామంటే నీటి సౌకర్యం లేదు. ఇలాగైతే శిక్షణ ఎలా పొందగలం.

– శషాంక్, జిమ్నాస్టిక్ క్రీడాకారుడు

వెలుగు కార్యాలయానికి తాళాలు



అనపర్తిలో వెలుగు కార్యాలయానికి తాళం వేస్తున్న టీడీపీ నేత కర్రి వెంకటరామారెడ్డి

పెదపూడి: అనపర్తిలోని వెలుగు కార్యాలయానికి తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి, కొప్పవరం గ్రామ మాజీ సర్పంచ్ కర్రి వెంకటరామారెడ్డి గురువారం తాళం వేశారు. వెలుగు కార్యాలయం అధికారుల పనితీరు బాగోలేదంటూ ఆరోపించారు. ప్రభుత్వం మారి 100 రోజులు కావస్తున్నా అధికారుల తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కొప్పవరం గ్రామానికి చెందిన ఒక మహిళ అభయ హస్తం పింఛన్ కోసం 2009లో ప్రీమియం చెల్లించినా ఆమెకు పింఛన్ రాలేదన్నారు. దీనిపై వెలుగు అధికారులను అడగ్గా 2011లో పింఛన్ మంజూరైందని ఆమె తీసుకోలేదని సమాధానం చెప్పారన్నారు. 2011లో మరో మహిళకు 60 ఏళ్లు పూర్తయిందని అభయ హస్తం పింఛన్‌కు ప్రీమియం చెల్లిందన్నారు. కానీ 2018లో ప్రీమియం చెల్లించలేదని ఆమెకు వెలుగు అధికారులు నోటీసు ఇచ్చారన్నారు. ఆ కారణంగా ఆమెకు కూడా అభయ హస్తం పింఛన్ రాలేదని చెప్పారన్నారు. ఇలా అనేక కారణాలతో చాలా మందికి పింఛన్ రావడం లేదని, అధికారులు సక్రమంగా పనిచేయడం లేదంటూ మండిపడ్డారు. ఈ విషయమై ఏపీఎం జిలానీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన సెలవులో ఉన్నట్లు సిబ్బంది సమాధానమిచ్చారు.

గంజాయి తరలిస్తూ పట్టుబడిన బాలికలు

గోకవరం: గంజాయి అక్రమ రవాణాలో అమాయక బాలికలు బలైపోతున్నారు. గోకవరంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు బాలికలను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ కథనం ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు గోకవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇద్దరు బాలికలను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు బ్యాగుల్లో సుమారు రూ.1.53 లక్షల విలువైన 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరికి చెందిన వారు. అక్కడి జోగ్సే వద్ద కొనుగోలు చేసి హర్యానాకు చెందిన రేణుకకు సరఫరా చేస్తున్నారని గుర్తించామని ఎస్పీ అన్నారు. పట్టుబడిన ఇద్దరూ చదువుకుంటున్నారని, వీరిని రాజమహేంద్రవరంలోని జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఛేదించిన నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, కోరుకొండ సీఐ సత్యకిశోర్, గోకవరం ఎస్సై పవన్‌కుమార్, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విగ్రహం కోసం వేలం



వేలంలో రూ.1.65 లక్షలు పలికిన వినాయక విగ్రహం

దేవరపల్లి: సాధారణంగా వినాయక చవితి ఉత్సవాల్లో స్వామివారి వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదానికి వేలం వేయడం చూస్తుంటాం.. అయితే ఇక్కడ ఓ ఆచారం ఏళ్ల కాలంగా నడుస్తోంది.. అదేంటంటే.. నవరాత్ర ఉత్సవాల్లో నిలిపిన ఉత్సవ విగ్రహానికి వేలం వేయడం, దానిని దక్కించుకున్న పాటదారుడి సారథ్యంలో నిమజ్జన ఊరేగింపు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇది దేవరపల్లిలోని మెరకవీధి వినాయకుడి ఆలయం వద్ద జరుగుతోంది. దీనికి సంబంధించి బుధవారం రాత్రి అక్కడి మండపంలో వినాయక విగ్రహానికి వేలం పాట నిర్వహించారు. ఆ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంపై ఊరేగించి, జలపాతంలో నిమజ్జనం చేయడానికి ఈ పాట జరిగింది. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన వేలం పాట అర్ధరాత్రి వరకూ సాగింది. చివరకు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడు, న్యాయవాది కొరం అప్పారావు నాయుడు, జీడిపప్పు వ్యాపారి అనిశెట్టి అబ్బు మధ్య గట్టి పోటీ నడిచింది. ఈ పోటీలో అబ్బు రూ.1.63 లక్షలకు పాడగా, కైరం అప్పారావు నాయుడు రూ. 1.65 లక్షలకు విగ్రహాన్ని సొంతం చేసుకున్నారు. ఈ విగ్రహాన్ని శనివారం గ్రామ పుర వీధుల్లో ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే స్వామివారికి భక్తులు సమర్పించిన 108 కిలోల లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించగా, పంచాయతీ సభ్యుడు పచ్చా రాంగోపాల్, దుగ్గిన లీలాకృష్ణ గంగాధర్ నాయుడు రూ.63 వేలకు సొంతం చేసుకున్నారు.

ఆంధ్రావాసి అమెరికాలో మృతి

తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు



మృతుడు రమేష్ (ఫైల్)

నల్లజర్ల: ప్రకాశరావుపాలేనికి చెందిన ముత్తిన రమేష్ (40) అమెరికాలో మృతి చెందినట్టు గురువారం కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని సోదరుడు నరేష్ అందించిన వివరాల ప్రకారం.. అమెరికాలోని ఇల్‌నాయిస్ రాష్ట్రంలోని కార్‌బొనలే సిటీలోని సదరన్ ఇల్‌నాయిస్ యూనివర్సిటీలో మృతుడు రమేష్ ఎంఎస్ చదవడానికి 2022లో వెళ్లాడు. ప్రయివేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకుంటున్నాడు. అక్కడి సిటిజన్‌తోనే రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆమెతో విభేదించి రమేష్ వేరుగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి రూంలో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పినట్టు నరేష్ తెలిపారు. సోమవారం, మంగళవారం రమేష్ ఆచూకీ లేకపోవడం, అతని రూం నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని, మృతదేహం పాడై ఉందని వివరించారు. అక్కడి పోలీసులే బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్ వచ్చి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహాన్ని మనదేశానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మృతుని మేనమామ వైఎస్సార్ సీపీ నాయకుడు కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు తెలిపారు. మృతునికి తండ్రి లేరు. తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్ ఇక్కడ ఉంటున్నారు.

బాల సుబ్రహ్మణ్యమే నాకు ఆదర్శం

వర్ధమాన గాయకుడు హనుమాన్



అమలాపురం టౌన్: ప్రముఖ సినీ గాయకుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తనకు ఆదర్శమని వర్ధమాన సినీ గాయకుడు త్సవటపల్లి హనుమాన్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన హనుమాన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే పలు సినిమాల్లో పాటలు పాడి వర్ధమాన గాయకుడిగా నిలదొక్కుకుంటున్నారు. సొంతూరుకు వచ్చిన ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని విలేకర్లతో మాట్లాడారు. చిన్నతనంలోనే తన తండ్రి సహకారంతో చెన్నైకి వెళ్లి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యాన్ని కలిశానని చెప్పారు. టీవీ షో స్వరాభిషేకం తదితర పాటల కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఎన్నో పాటలు పాడి ఈ స్థాయికి వచ్చానని వివరించారు. తాను ఇప్పటి వరకూ 30 సినిమాల్లో పాటలు పాడానని చెప్పారు. వెంకీమామ చిత్రంలో 'కోకోకోలా పెప్సీ' పాటకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. డార్లింగ్ సినిమాలో ఓ పాట మంచి ట్రెండ్‌లోకి వచ్చిందని చెప్పారు. స్కంద చిత్రంలో కూడా పాటలు పాడానని తెలిపారు. తాను సినీ సంగీత దర్శకులు తమన్, మణిశర్మ, కోటి వద్ద పనిచేసి పాటలు పాడానన్నారు. దాదాపు రెండు వేల వరకూ స్టేజ్ షోలు చేశానని చెప్పారు. ఇవి కాకుండా హిందీ, మలయాళం, తమిళ భాషల్లో కూడా పలు పాటలు పాడానని తెలిపారు. హిందీ చిత్రం 'లియో'లో 'బ్యాడస్' అనే పాట పాడానన్నాను. తెలుగు చిత్రం 'కీడా కోలా' చిత్రంలో 'దిపిరి దిపిరి' సాంగ్ మంచి పాపులర్ అయ్యిందని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ కోనసీమ శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొలకోటి రంగారావు, బీఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత డీఈఈ వెంకటేశ్వరరావు, గాయకుడు హనుమాన్ తండ్రి త్సవటపల్లి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమలాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గాయకుడు హనుమాన్‌కు ఘన సత్కారం జరిగింది. స్థానిక కిమ్స్ వైద్య కళాశాలలో 'బ్యాండ్' పేరుతో గురువారం రాత్రి జరిగిన సంగీతా విభావరిలో కూడా గాయకుడు హనుమాన్ పలు పాటలు పాడి అలరించారు.

అది పులి కాదు.. అడవి పిల్లి

- తోటల్లోకి చిరుత దూకిందనే వార్తల్లో నిజం లేదు
- నిర్ధారించిన అటవీశాఖ అధికారులు



శ్రీరామపురంలోని సీసీ కెమెరాకు చిక్కిన అడవి పిల్లి చిత్రం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువు శివారు శ్రీరామపురం, రాకీ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ సమీపంలోని తోటల్లోకి బుధవారం రాత్రి చిరుతపులి దూకిందనే ప్రచారంలో నిజం లేదని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.భరణి తెలిపారు. ఆ ప్రాంతంలో ఒక జంతువు సంచరించిన మాట వాస్తవమేగానీ అది చిరుత పులి కాదని, అడవి పిల్లి అని నిర్ధారించారు. ఆ ప్రాంతంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో అడవి పిల్లిని గుర్తించామని, పాదముద్రలు కూడా దానివేనన్నారు. గత రాత్రి కోలమూరులో కూడా చిరుతపులి సంచరించినట్టు వచ్చిన ప్రచారం సరికాదన్నారు. అక్కడ కూడా అడవి పిల్లి పాదముద్రలే కనిపించాయన్నారు. ఈ రెండు ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు వచ్చిన ప్రచారాలతో వెంటనే తమ నిపుణుల బృందాలను పంపించి, పరిశీలించామన్నారు. అక్కడ గుర్తించిన పాదముద్రల ప్రకారం అడవి పిల్లిగా నిర్ధారణకు వచ్చామన్నారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల వద్ద చిరుతపులి సంచరిస్తున్నట్టు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు.



అడవి పిల్లి పాదముద్రలు

మరిన్ని ట్రాప్ కెమెరాల ఏర్పాటు

లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో దానిని గుర్తించి, పట్టుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని భరణి చెప్పారు. మొన్నటి వరకూ వివిధ ప్రాంతాల్లో 50 ట్రాప్ కెమెరాలను అమర్చగా, అది సంచరిస్తున్న ఏరియాలకు అనుగుణంగా వీటిని కూడా స్థాన మార్పులు చేస్తూ వాటి వందకు పెంచామన్నారు. అలాగే ఏడు బోనులను ఏర్పాటు చేసి, చిరుతపులిని సురక్షితంగా బంధించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి, భయపడవద్దని, ఆ విధంగా అసత్య ప్రచారాలు చేసే వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటారని భరణి హెచ్చరించారు. చిరుత పులిని పట్టుకునేందుకు శాఖాపరంగా చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు.

ముగ్గురిపై హత్యాయత్నం కేసు



రిసార్ట్స్ వద్ద విచారణ చేస్తున్న డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్

అల్లవరం: ఓడలరేవు తీరంలోని సముద్ర రిసార్ట్స్‌లో బుధవారం రాత్రి వంట కుక్ మట్టా దుర్గాప్రసాద్‌పై ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ విచారణ చేపట్టారు. గురువారం ఉదయం రిసార్ట్స్‌లో ఘటన జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన సుంకర సురేష్, తోరం రమేష్, తిక్కిరెడ్డి బన్ని రిసార్ట్స్‌లో అద్దెకు రూమ్ తీసుకున్నారని అన్నారు. వారు తీసుకున్న రూమ్ గడువు ముగియడంతో రిసార్ట్స్ నిర్వాహకుడు విలియమ్స్ రూమ్ ఖాళీ చేయమని కోరగా, పైముగ్గురూ విలియమ్స్‌తో ఘర్షణకు దిగారు. దీంతో అక్కడే పనిచేస్తున్న దుర్గాప్రసాద్ వారిని వారించడంతో అందుబాటులో ఉన్న మద్యం సీసాతో దుర్గాప్రసాద్ తలపై కొట్టారు. దీంతో అతనికి తీవ్ర రక్తస్రావం కావడంతో నిర్వాహకులు అమలాపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనలో రమేష్, బన్ని, సురేష్‌లపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట ఎస్సై హరీష్‌కుమార్ ఉన్నారు.

గణపతి నిమజ్జనంలో ఘర్షణ



ఘర్షణ ప్రదేశంలో రాళ్లు రువ్వుతున్న ఆందోళన కారులు



కొవ్వూరులో ఘర్షణ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్

- ఇరువర్గాలు రాళ్ల దాడి
- పోలీసులతో పాటు పలువురికి గాయాలు
- సంఘటన స్థలంలో పోలీస్ పికెట్ ఏర్పాటు



గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

కొవ్వూరు: పట్టణంలోని వినాయక నిమజ్జనం సందర్భంగా గురువారం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం శ్రీరామ కాలనీలోకి ప్రవేశించగానే ఒకవర్గం యువకులు మరోవర్గంపై దాడికి తెగబడ్డారు. ఇటీవల అదేకాలనీకి చెందిన వినాయక విగ్రహం ఊరేగింపులో రెండు కాలనీలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ జరిగినట్లు స్థానికులు తెలిపారు. కాగా గురువారం జరిగిన దాడిలో ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు చేయి, కాలుకు గాయాలయ్యాయి.

సీఐకి సైతం గాయాలు

పట్టణ సీఐ పి.విశ్వం ఇరువర్గాలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో రెండు వర్గాలు రాళ్లు రువ్వుకోవడంతో సీఐకి సైతం గాయాలయ్యాయి. రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన పలకంశెట్టి సురేష్‌కు చెందిన స్కూటర్‌ను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. అలాగే పురపాలక సంఘానికి చెందిన డస్ట్‌బిన్లు, చెత్త తరలించే రిక్షాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. రాజీవ్ కాలనీ చెందిన చొక్కా నందకిషోర్ అనే యువకుడు గాయాలపాలై కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీరామ కాలనీకి చెందిన జి.దావీదు, పి.రాహుల్‌కు గాయాలు కాగా ఆసుపత్రి సిబ్బంది వైద్యం చేసి పంపించారు. నందకిషోర్ ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఆందోళన కారులు విక్షణారహితంగా రాళ్లు రువ్వుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇద్దరు వృద్ధులకు రాళ్లు తగిలాయి.

వివరాలు తెలుసుకున్న ఎస్పీ

జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అదనపు బలగాలను వేసుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ జి.దేవకుమార్‌తో పాటు డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బంది, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు, అదనపు బలగాలు మొహరించాయి. మళ్లీ ఇరువర్గాల మధ్య ఘర్షణకు ఆస్కారం లేకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

డ్రగ్స్ తయారీ కేసులో మరొకరి అరెస్ట్

నల్లజర్ల: ఘంటావారిగూడెంలో మత్తు మందు ఆల్ప్రోజోలం తయారీ కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కొయ్యలగూడేనికి చెందిన పవులూరి శ్రీనివాస్‌ను అతని స్వగ్రామంలోనే అరెస్ట్ చేశామన్నారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేశారు. వారిలో స్థల యజమాని తాతిన బాలకృష్ణ, పుల్లలపాడుకు చెందిన పాతూరి సతీష్, హైదరాబాద్‌కు చెందిన డ్రగ్స్ తయారీ నిపుణులు సాంబన జగదీష్, మాకం వెంకటేష్ ఉన్నారు.